# అసెంబ్లీ ఎన్నికల బరిలో .. 102 మంది అభ్యర్థులు




## 23 మంది నామినేషన్ల ఉపసంహరణ
## ఇక ఊపందుకోనున్న ఎన్నికల ప్రచారం

సంగారెడ్డి, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో 102 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. బుధవారంతో నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యింది. ఐదు నియోజకవర్గాల్లోని 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. సంగారెడ్డి, నారాయణఖేడ్, అందోల్, పటాన్‌చెరు, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 102 మంది ఎన్నికల బరిలో నిలిచారు. వీరంతా ఈనెల 30న జరిగే ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 138 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్క్రూట్నీలో 13 మంది అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. దీంతో 125 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించగా, బుధవారం నామినేషన్ల ఉపసంహరణలు జరిగాయి. 125 మంది అభ్యర్థులకు గానూ ఐదు నియోజకవర్గాల్లోని 23 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల్లో 102 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. అత్యధికంగా సంగారెడ్డి నియోజకవర్గంలో 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

### ఎన్నికల బరిలో 102 మంది అభ్యర్థులు

సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల్లో 102 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 20 మంది నామినేషన్లు అనుమతించగా, ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 18 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులైన మహారెడ్డి భూపాల్‌రెడ్డి (బీఆర్ఎస్), పి.సంజీవరెడ్డి (కాంగ్రెస్), జెనవాడే సంగప్ప (బీజేపీ)తోపాటు 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 28 మంది నామినేషన్లు అనుమతించగా, ఆరుగురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల్లో 22 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. జహీరాబాద్‌లో ప్రధాన పార్టీ అభ్యర్థులు కొనింటి మాణిక్‌రావు (బీఆర్ఎస్), ఎ.చంద్రశేఖర్ (కాంగ్రెస్), సి.దామోదర రామచందర్ (బీజేపీ)తోపాటు 19 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. అందోల్ నియోజకవర్గంలో 22 మంది అభ్యర్థులు నామినేషన్లు అనుమతించగా, నలుగురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో పోటీలో 18 మంది అభ్యర్థులున్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థులు చంటి క్రాంతికిరణ్ (బీఆర్ఎస్), దామోదర్ రాజనర్సింహా (కాంగ్రెస్), పి.బాబూమోహన్ (బీజేపీ)తోపాటు 15 మంది పోటీలో ఉన్నారు. సంగారెడ్డి అసెంబ్లీలో 30మంది నామినేషన్లు అనుమతించారు. ఇందులో ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోగా, 28 మంది పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన చింతా ప్రభాకర్ (బీఆర్ఎస్), జగ్గారెడ్డి (కాంగ్రెస్), పులిమామిడి రాజు (బీజేపీ)తోపాటు 25 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మొత్తం 25 నామినేషన్లను అనుమతించగా, తొమ్మిది మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 16 మంది పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థులు గూడెం మహిపాల్‌రెడ్డి (బీఆర్ఎస్), కాట శ్రీనివాస్‌గౌడ్ (కాంగ్రెస్), నందీశ్వర్‌గౌడ్ (బీజేపీ)తోపాటు 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

### ముమ్మరం కానున్న ప్రచారం

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిపై స్పష్టత రావటంతో ప్రధాన పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేయనున్నారు. ఈనెల 30న ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపు వ్యూహాలకు పదునుపెడుతున్నారు. మరోవైపు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలుపొందాలన్న లక్ష్యంతో ప్రధాన పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు పావులు కదుపుతున్నారు.

**నామినేషన్ల ఉపసంహరణ, బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య**

| నియోజకవర్గం | ఉపసంహరణ | బరిలో |
|---|---|---|
| నారాయణఖేడ్ | 02 | 18 |
| అందోలు (ఎస్సీ) | 04 | 18 |
| జహీరాబాద్ (ఎస్సీ) | 06 | 22 |
| సంగారెడ్డి | 02 | 28 |
| పటాన్‌చెరు | 09 | 16 |



సంగారెడ్డి: మంత్రి హరీశ్‌రావును పూలమాలలతో సత్కరించిన నాయకులు

# బీఆర్ఎస్‌లోకి చేరికలు

## గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి, నవంబర్ 15: బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలకు, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజెవైఎం నేతలు భారీగా బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం కాంగ్రెస్‌కు చెందిన కంది మండలం మామిడిపల్లికి ఉపసర్పంచ్‌తో పాటు బీజెవైఎం మండల అధ్యక్షుడితో సహా పలువురు నాయకులు హైదరాబాద్ తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో తరలివెళ్లి మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మంత్రి హరీశ్‌రావును భారీ గజమాలతో సత్కరించారు. చేరిన వారిలో మామిడిపల్లి ఉపసర్పంచ్ రమేశ్‌రెడ్డి, వార్డు సభ్యులు నర్సింలు, రత్నాకర్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, బీజెవైఎం మండలాధ్యక్షుడు అంజి యాదవ్, షేక్ ముబీన్, కబీర్ తదితరులున్నారు.

# నేడు హద్నూర్‌లో మంత్రి హరీశ్‌రావు ప్రచార సభ

న్యాల్‌కల్, నవంబర్ 15: జహీరాబాద్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్‌కు రానున్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావుకు మద్దతుగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించనున్నారు. బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, జహీరాబాద్ నియోజకవర్గ సమన్వయ కార్యవర్త దేవీప్రసాద్, ఉమ్మడి జిల్లా సహకార సంఘం చైర్మన్ ఈదులపల్లి శివకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సభకు జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఏర్పుల నరోత్తం, పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ మహ్మద్ తన్వీర్, జడ్పీటీసీ స్వప్న కుమారి, ఎంపీపీ అంజమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్ హాజరు కానున్నారని గ్రామ సర్పంచ్ వీరామణి, పార్టీ ప్రధాన మండల కార్యదర్శి రాజ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్, పార్టీ గ్రామాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

# అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు

## 513 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు



అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రంలో తనిఖీలు

సంగారెడ్డి, నవంబర్ 15: అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న కేంద్రాలపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి, 513 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సదాశివపేట, పటాన్‌చెరు మండలాల పరిధిలో అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, పట్టుబడిన వారిని ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించి, విచారణ చేస్తున్నారు. సూరారంలోని ధరణి వాటర్ ప్లాంట్‌లో యజమాని తులసి రాజేందర్, మన్నే సతీశ్, రాజ్ కలిసి గ్యాస్ గోదాం నిర్వహిస్తూ, అక్రమంగా గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్నారన్న సమాచారంతో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఫుల్ గో గ్యాస్ సిలిండర్లు 21 కేజీలవి 314, 21 కేజీల ఖాళీవి 60, 4 కేజీల సిలిండర్లు 63, 19 కేజీల ఫుల్ హెచ్‌పీ సిలిండర్లు 7, హెచ్‌పీ గ్యాస్ ఖాళీవి 19, 6 కేజీల చిన్న హెచ్‌పీ సిలిండర్లు 2లతో పాటు రీఫిల్లింగ్ పైప్స్ 4, రీఫిల్లింగ్ మోటర్స్ 2లను స్వాధీనం చేసుకున్నారు. సదాశివపేట పట్టణంలో అబ్దుల్ సలీం అనే వ్యక్తి తన సైకిల్ రిపేర్ షాప్‌లో అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తుండడంతో దాడులు చేశారు. ఇక్కడ 18 కేజీల కమర్షియల్ సిలిండర్ ఒకటి, 17.6 కేజీలు గల సిలిండర్ ఒకటి, 15.9 కేజీల గృహోపకర సిలిండర్లు 2, 15.8 కేజీల సిలిండర్ ఒకటి, చిన్న సిలిండర్లు 3, మొత్తం 9 సిలిండర్లతోపాటు వేయింగ్ మిషన్ ఒకటి, రీ ఫిల్లింగ్ మోటర్స్ ఒకటిని స్వాధీనం చేసుకున్నారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రముఖ్‌నగర్, ఇస్నాపూర్‌లో శివకుమార్ అనే వ్యక్తి తన షాప్‌లో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో 18.5 కేజీల గో గ్యాస్ ఫుల్ సిలిండర్లు 3, రన్నింగ్ సిలిండర్లు ఒకటి, హెచ్‌పీ గ్యాస్ 16 కేజీల ఖాళీవి 2, చిన్నవి 3.5 కేజీలవి 9 మొత్తం 15 సిలిండర్లతోపాటు రీఫిల్లింగ్ పైప్ ఒకటి, వేయింగ్ మిషన్ ఒకదానిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించి, విచారణ చేస్తున్నారు. సందర్భంగా జిల్లా ఎస్పీ రూపేశ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న దాడుల్లో గ్యాస్ రీ ఫిల్లింగ్‌లు చేస్తూ లాభాలు గడిస్తున్న అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు అరికట్టేందుకు జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

# గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

## 12 కిలోల గంజాయి మొక్కలు స్వాధీనం

న్యాల్‌కల్, నవంబర్ 15: నిషేధిత గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ హెచ్చరించారు. బుధవారం జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం మండలంలోని డప్పూర్ గ్రామంలో ఫక్రోద్దీన్ చెరుకు పొలంలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. పొలంలో మిశ్రమ పంటగా అక్రమంగా సాగు చేసిన 12 కిలోల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు గంజాయి మొక్కలతో పాటు పొలం యాజమాని ఫక్రోద్దీన్‌ను ఆరెస్టు చేసి హద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ చెన్నూరి రూపేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గంజాయిని రైతులు ఎవ్వరైనా సాగు చేసినా, నిలువ చేసినా, రవాణా చేసిన చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ వ్యవసాయ పొలాన్ని సీజ్‌చేసి తహసీల్దార్‌కు అప్పగించనున్నామని, ఆదేశాలను అతిక్రమించి తిరిగి పొలంలో గంజాయిని సాగు చేస్తే పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల చట్టవ్యతిరేక కార్యక్రమాలను అరికట్టేందుకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



పొలంలో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్సు బృందం